క్లుప్తంగా

ఓసీ-4ను సందర్శించిన టీబీజీకేఎస్ నేతలు

మణుగూరు టౌన్: సింగరేణి మణుగూరు ఏరియాలోని ఓసీ-4ను టీబీజీకేఎస్ నాయకులు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా బ్రాంచి ఉపాధ్యక్షుడు వి.ప్రభాకర్‌రావు ఆధ్వర్యాన కార్మికుల సమస్యలు తెలుసుకోగా, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వీఎస్.వర్మ, మల్లేశ్, యాదవ్‌రెడ్డి, సోమిరెడ్డి, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు వైద్య పరీక్షలు



నిల్వ నీటిని పారబోస్తున్న సిబ్బంది

అశ్వారావుపేటరూరల్: మండలంలోని గుమ్మడవల్లి పీహెచ్‌సీ పరిధి పాత కన్నాయిగూడెం గిరిజన గ్రామంలో మంగళవారం ఆరోగ్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది 41 మందిని పరీక్షించగా ఏడుగురు జ్వరంతో బాధపడుతున్నట్లు గుర్తించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. సబ్ యూనిట్ అధికారి అజ్మీరా వెంకటేశ్వరరావుతోపాటు కృష్ణయ్య, వెంకటేశ్వర్లు, రాధాబాయి పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ స్టేషన్‌లో పరిశీలిస్తున్న అధికారులు

మణుగూరు టౌన్: మణుగూరులోని పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్, పోలీసు సిబ్బంది మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్ సౌకర్యాలపై ఆరా తీసి వివరాలు నమోదు చేసుకున్నారు. తహసీల్దార్ రాఘవరెడ్డి, సీఐ రమాకాంత్, ఎస్‌ఐలు శ్రీనివాస్, రాజేశ్ పాల్గొన్నారు.

పాలకులను యువత ప్రశ్నించాలి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

అశ్వారావుపేటరూరల్: ప్రజా సమస్యలపై పాలకులను యువత ప్రశ్నించాలని.. తద్వారా సమస్యలకు పరిష్కారం లభిస్తుందని పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు వాసం బుచ్చిరాజు అన్నారు. ఈనెల 12నుంచి మహబూబాబాద్‌లో జరగనున్న పీవైఎల్ రాష్ట్ర మహాసభల పోస్టర్లను ఆయన మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం ఆవిష్కరించి ప్రచారం చేశారు. నాయకులు గోగినపల్లి ప్రభాకర్, దుర్గారావు, బాడిస లక్ష్మణ్‌రావు, మడకం నవీన్, కట్టం రాజారావు, మడకం రాజులు పాల్గొన్నారు.

తగిన ఉద్యోగం ఇవ్వాలి

మణుగూరు టౌన్: సింగరేణిలో అన్‌ఫిట్ అయిన సూపర్‌వైజర్లు, ట్రేడ్స్‌మెన్, ఈపీ ఆపరేటర్లకు తగిన ఉద్యోగాలే ఇవ్వాలని ఏఐటీయూసీ బ్రాంచి సెక్రటరీ రాంగోపాల్ డిమాండ్ చేశారు. ఏరియాలోని ఓసీ-2లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వన్ టైం సెటిల్‌మెంట్ పేరిట అన్యాయం చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. అనంతరం ఏరియా డీజీఎం(పర్సనల్) సలగల రమేశ్‌కు వినతిపత్రం అందజేశారు. నాయకులు నరసయ్య, మేకల ఈశ్వర్, పుల్లారావు, ఆవుల నాగరాజు, నంబూరి శ్రీనివాస్, గంగాధర్‌రావు, రవికుమార్, శ్రీనివాసరావు, సాయి ప్రకాశచారి, ఎస్.కే. అలీ, జానకీప్రసాద్, శ్రీను, పాపారావు ఉన్నారు.

మంచి ఆహారపు అలవాట్లతోనే ఆరోగ్యం



వైద్యపరీక్షలు చేస్తున్న శివకుమార్

మణుగూరు రూరల్: ప్రజలు మంచి ఆహారపు అలవాట్లు కలిగి ఉండడం ద్వారా అనారోగ్యం దరి చేరదని మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి శివకుమార్ తెలిపారు. మండలంలోని విఠల్‌రావునగర్‌లో మంగళవారం నిర్వహించిన వైద్యశిబిరంలో ఆయన స్థానికులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. అనంతరం శివకుమార్ మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు తమ ఇళ్లలోనే కాక పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, మానసిక ఒత్తిడిని అధిగమించేందుకు యోగా,ధ్యానం చేయాలని సూచించారు. సీహెచ్‌ఓ వెంకటేశ్వరరావు, ఉద్యోగులు రాంప్రసాద్, రమాదేవి, లక్ష్మి పాల్గొన్నారు.

దాహార్తి తీరేదెన్నడో ?!

- పలు ఏజెన్సీ గ్రామాలకు అందని తాగునీరు
- కలగానే మిగిలిన మిషన్ భగీరథ
- అలంకారప్రాయంగా ట్యాంకులు



బోదనెల్లిలోని మిషన్ భగీరథ ట్యాంక్

చర్ల రూరల్: ఏజెన్సీ ప్రాంతమైన చర్ల మండలంలోని అనేక గ్రామాలకు ఇప్పటివరకు కూడా మిషన్ భగీరథ తాగునీటి పథకం అందని ద్రాక్షగానే మిగిలింది. అధికారుల పర్యవేక్షణా లోపం ప్రజలకు శాపంగా మారింది. కొన్ని గ్రామాల్లో కనీసం పైపు లైన్లు కూడా వేయకోగా.. ట్యాంకులు నిర్మించి, పైపు లైన్లు వేసిన ప్రాంతాలకు నీరు అందడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. పంచాయతీ అధికారులు, మిషన్ భగీరథ అధికారులు ఒకరిపై ఒకరు నెపం వేసుకుంటూ కాలం వెళ్లదీస్తుండడమే తప్ప సమస్య పరిష్కారానికి చొరవ చూపడం లేదు. ఫలితంగా మండలంలోని అనేక గ్రామాల్లో ప్రజలు దాహార్తితో తల్లడిల్లుతున్నారు. ఓపక్క గోదావరి నది.. మరోపక్క తాలిపేరు ఉపనదులు ప్రవహిస్తున్నా గ్రామాల్లో తాగడానికి నీళ్లు రాకపోవడం తమ దురదృష్టంగా ప్రజలు ఆవేదన చెందుతున్నారు.

బోరు నీరే దిక్కు..

మండలంలోని బోదనెల్లి, తిప్పాపురం, చింతగుప్ప, కుర్నపల్లి ఇలా అనేక గ్రామాలు త్రాగునీటి కోసం తహతహలాడుతున్నాయి. గ్రామాల్లోని మిషన్ భగీరథ ట్యాంకులు అలంకారప్రాయంగానే దర్శనమిస్తున్నాయి. తాగునీళ్లు లేక బోరునీటినే తాగుతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యపై ఎన్నిసార్లు అధికారులకు చెప్పినప్పటికీ పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ప్రతీరోజు నీళ్లు కొనుక్కోవాల్సిన పరిస్థితి నెలకొందని జనం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మిషన్ భగీరథ, పంచాయతీల అధికారుల సమన్వయంతో వ్యవహరించి తాగునీటి కష్టాలను తీర్చాలని కోరుతున్నారు.

పది రోజుల్లో సరఫరా చేస్తాం...

తిప్పాపురం, కుర్నపల్లి, బోదనెల్లి గ్రామాల్లో పైపులైన్లకు కొన్నిచోట్ల లీకేజీలు, చింతగుప్పలో ట్రాన్స్‌ఫార్మర్ సమస్య ఇలా రకరకాల సమస్యలతో కొన్ని గ్రామాలకు నీళ్లు అందడం లేదు. పది రోజుల్లో తానీళ్లు అందించేందుకు కృషి చేస్తాం.

– పి.ఏసుబాబు, డీఈఈ, మిషన్ భగీరథ

భగీరథ నీళ్లే రాలేదు...



మా గ్రామానికి ఇంతవరకు మిషన్ భగీరథ తాగునీరు రాలేదు. గ్రామంలో ట్యాంకులు నిర్మించినా అవి అలంకార ప్రాయంగానే ఉన్నాయి. మా ఇబ్బందులను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారంపై దృష్టి సారించడం లేదు.

– ఏల్పు రాజేష్, బోదనెల్లి

బోరు నీళ్లే తాగుతున్నాం...



మా ఊరికి ఇప్పటివరకు కూడా మిషన్ భగీరథ ద్వారా నీళ్లు రావడం లేదు. దీంతో చేసేది లేక బోరు నీళ్లే తాగుతున్నాము. ఏళ్ల తరబడి మాకు బోర్లే దిక్కవుతున్నాయి. భగీరథనీళ్లు వస్తాయని చెప్పినా అలా జరగకపోవడంతో మా ఇక్కట్లు తీరడం లేదు.

– ఇర్ప ముత్తమ్మ, బోదనెల్లి

అప్పుడు వచ్చేవి...



మిషన్ భగీరథ మంచినీళ్లు మొదట్లో కొన్ని రోజులు వచ్చాయి కానీ ఇప్పుడు రావడం లేదు. దీంతో మళ్లీ బోరు నీళ్లనే తాగుతున్నాం. మొదట్లో ఎందుకు ఇచ్చారో, ఆతర్వాత ఎందుకు ఆపారో తెలియడం లేదు.

– దబ్బ కార్తీక్, తిప్పాపురం

ఎన్నికల నిబంధనలు పాటించాలి



పినపాక : తనిఖీ చేస్తున్న సీఐ శివప్రసాద్

గుండాల: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యాన ప్రతీఒక్కరు నిబంధనలు పాటించాలని, ఎవరైనా శాంతిభద్రతలకు భంగం కలిగేలా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ రవీందర్ హెచ్చరించారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నేపథ్యాన మండల కేంద్రంలో మంగళవారం పోలీసు చెక్‌పోస్టు ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ రూ.50వేల మించి నగదును సరైన ఆధారాలు లేకుండా తీసుకెళ్తే సీజ్ చేస్తామని తెలిపారు. అలాగే, లైసెన్సు కలిగిన ఆయుధాలను పోలీస్ స్టేషన్‌లో డిపాజిట్ చేయాలని, ప్రచార సభలు, ర్యాలీలకు అనుమతి తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా వాహనాలను తనిఖీ చేయగా ఎస్సై రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

వాహనాల తనిఖీలు

పినపాక: మండలంలోని బయ్యారం క్రాస్ రోడ్డులో సీఐ శివప్రసాద్ ఆధ్వర్యాన మంగళవారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఎవరైనా రూ.50వేలకు మించి నగదు తీసుకెళ్తే తగిన ఆధారాలు సమర్పించాలని అవగాహన కల్పించారు.

అశ్వాపురంలో..

అశ్వాపురం: మండల కేంద్రంలో ఎస్సై తిరుపతిరావు ఆధ్వర్యాన మంగళవారం వాహనాల తనిఖీ చేపట్టారు. కాగా, ఓ వాహనంలో తీసుకెళ్తున్న రూ.30 లక్షలను గుర్తించిన పోలీసులు ఆరా తీయగా డీసీసీబీ బ్యాంక్ నగదును భద్రాచలం నుండి పినపాక మండలం బయ్యారం తీసుకెళ్తున్నట్టు డీసీసీబీ బ్యాంక్ మేనేజర్ పూర్తి ఆధారాలు సమర్పించగా తిరిగి ఇచ్చేశారు.

కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి



పార్టీలో చేరిన వారికి కండువా కప్పుతున్న పాయం

మణుగూరు టౌన్: ఎన్నికలు సమీపిస్తున్న వేళ ప్రతీ కార్యకర్త, నాయకుడు సైనికుడిలా పనిచేయాలని మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సూచించారు. మణుగూరులోని క్యాంప్ కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా పనిచేయాలని తెలిపారు. కాగా, తిర్లాపురం ఉప సర్పంచ్ కంటెం సురేశ్ బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరగా ఆయనకు పాయం కండువా కప్పారు. నాయకులు కే.వీ.రావు, గుండగాని నాగేశ్వరరావు, గోరంట్ల కనకయ్య, పుచ్చకాయల శంకర్, వీరంకి వెంకట్రావుగౌడ్, బాజీ, తరుణ్‌రెడ్డి, కంటెం సురేశ్, తాటి భిక్షం, సామా శ్రీనివాసరెడ్డి, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీసీఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోళ్లకు ఏర్పాట్లు

బూర్గంపాడు: సీసీఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోళ్లకు మార్కెటింగ్ శాఖ ఏర్పాట్లు చేస్తోందని బూర్గంపాడు వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రత్యేక శ్రేణి కార్యదర్శి నిర్మల తెలిపారు. మంగళవారం విలేకరులకు ఆమె వివరాలు వెల్లడించారు. పినపాక నియోజకవర్గంలోని బూర్గంపాడు, అశ్వాపురం, మణుగూరు, పినపాక, కరకగూడెం మండలాల రైతులు పత్తిని సీసీఐకి విక్రయించేందుకు లక్ష్మీపురంలోని అనుశ్రీ కాటన్ మిల్లులో అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ఐదు మండలాల నుంచి సుమారు 2.09 లక్షల క్వింటాళ్ల పత్తి వస్తుందని అంచనా వేశామని, నవంబర్ మొదటివారం నుంచి కొనుగోళ్లు ప్రారంభమవుతాయని చెప్పారు. ప్రభుత్వం పత్తి క్వింటాకు రూ.7,020 మద్దతు ధర ప్రకటించిందని, సీసీఐకి పత్తిని విక్రయించే రైతులు తప్పనిసరిగా బయోమెట్రిక్ వినియోగించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఆధార్‌కార్డును బ్యాంకు ఖాతాకు అనుసంధానం చేసుకోవాలని, వ్యవసాయశాఖ అధికారులను సంప్రదించి ఆధార్‌కార్డు అప్‌డేట్, బ్యాంకు ఖాతా, పట్టాదారు పాస్ పుస్తకాల వివరాలను ముందుగానే ఆన్‌లైన్ చేసుకోవాలని సూచించారు.

బీఆర్ఎస్‌లో 120 కుటుంబాల చేరిక



బీఆర్ఎస్‌లో చేరిన వారితో ఎమ్మెల్యే మెచ్చా

అశ్వారావుపేటరూరల్: మండలంలోని మామిళ్లవారిగూడెం, నారాయణపురం గ్రామాలకు చెందిన సుమారు 120 కుటుంబాల వారు మంగళవారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు సమక్షంలో వీరంతా బీఆర్ఎస్‌లోకి చేరగా ఆయన పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కాగా, పార్టీలో చేరిన వారిలోవైఎస్సార్‌టీపీ మండల అధ్యక్షుడు కె.నరేష్ తదితరులు ఉండగా, సర్పంచ్ కంగాల పరమేష్, నాయకులు మందపాటి మోహన్‌రెడ్డి, ప్రకాశ్‌రావు, చందా లక్ష్మీనర్సయ్య, జక్కుల రాంబాబు, మోటూరి మోహన్ పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉంటేనే ఆరోగ్యం

అన్నపురెడ్డిపల్లి: వాతావరణంలో మార్పుల కారణంగా వచ్చే సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ స్పందన సూచించారు. మండలంలోని ఎర్రగుంట పీహెచ్‌సీని మంగళవారం సందర్శించిన ఆమె ఓపీ సేవలు, ఆరోగ్య మహిళ క్లినిక్‌లో మహిళలకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. అనంతరం మాట్లాడుతూ జ్వరం ఉన్న వారు రక్తపరీక్షలు చేయించుకోవాలని, పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని తెలిపారు. ఆతర్వాత మండలంలోని అబ్బుగూడెం, మర్రిగూడెంల్లో హెల్త్ క్యాంప్‌లను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. వైద్యాధికారులు ప్రియాంక, తన్మయి, సిబ్బంది పాల్గొన్నారు.

నిర్ణీత ప్రాంతాల్లోనే వాహనాలు నిలపాలి



వ్యాపారులకు అవగాహన కల్పిస్తున్న సీఐ రవీందర్

మణుగూరు టౌన్: ప్రధాన రహదారిపై ఇష్టమున్నట్లు ద్విచక్ర వాహనాలు నిలిపినా, రహదారి వెంట లారీలు ఆపి సరుగులు దిగుమతి చేసినా చర్యలు తీసుకుంటామని సీఐ రవీందర్ తెలిపారు. ఈసందర్భంగా మంగళవారం ఆయన పట్టణంలోని వ్యాపారులకు అవగాహన కల్పించారు. నిర్ణీత ప్రాంతాల్లోనే పార్కింగ్ చేయాలని, తగిన సమయంలో సరుకులు దిగుమతి చేయించాలని సూచించారు. అలాకాకుండా ప్రయాణికులు, వాహనదారులకు ఇబ్బంది కలిగిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

క్రీడలతో శారీరక దృఢత్వం



మాట్లాడుతున్న జీఎం రాంచందర్

మణుగూరు టౌన్: క్రీడలు శారీరక దృఢత్వానికి దోహదపడతాయని సింగరేణి మణుగూరు ఏరియా జీఎం దుర్గం రాంచందర్ తెలిపారు. స్థానిక భద్రాద్రి స్టేడియంలో కంపెనీ స్థాయి కబడ్డీ, బ్యాడ్మింటన్ పోటీలను మంగళవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. క్రీడాకారులు ఎప్పటికప్పుడు నైపుణ్యాలు పెంపొందించుకుని పోటీల్లో సత్తా చాటాలని సూచించారు. కార్యక్రమంలో అధికారులు, సంఘాల నాయకులు వీసం కృష్ణయ్య, లక్ష్మీపతిగౌడ్, సలగల రమేశ్, సింగు శ్రీనివాస్, వి.ప్రభాకర్‌రావు, నాగరాజు, కొడిపెల్లి శ్రీలత, ప్రసాద్, కిషన్, స్పోర్ట్స్ సూపర్‌వైజర్ వెస్లీ తదితరులు పాల్గొన్నారు.

రౌడీషీటర్ల బైండోవర్

అశ్వారావుపేటరూరల్: ఎన్నికల నేపథ్యానపలువురు రౌడీషీటర్లపై మంగళవారం బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు ఎస్సై పి.శ్రీకాంత్ తెలిపారు. వివిధ గ్రామాలకు చెందిన ఏడుగురు రౌడీషీటర్లను అదుపులోకి తీసుకొని తహసీల్దార్ కృష్ణప్రసాద్ ఎదుట హాజరు పర్చామని చెప్పారు. అనంతరం శాంతిభద్రతకు విఘాతం కలిగించకుండా సూచనలు చేసి సొంత పూచీకత్తుపై విడుదల చేశామని తెలిపారు.

విధుల్లో చేరిన జీపీ ఈఓ

భద్రాచలంఅర్బన్: భద్రాచలం గ్రామపంచాయతీ ఈఓగా శ్రీనివాసరావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దేలా కృషి చేస్తామని తెలిపారు. పట్టణ ప్రజలకు పరిశుభ్రత విషయంలో సమస్యలు ఉంటే ఫిర్యాదు చేయాలని సూచించారు.

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు

దుమ్ముగూడెం: మండలంలోని పొలూరిపేటలో విద్యుత్‌వైర్లు కిందకు వేలాడుతూ ప్రమాదకరంగా మారాయని సీపీఎం నాయకుడు, సొసైటీ డైరెక్టర్ ఉబ్బ భద్రయ్య తెలిపారు. పాత నారాయణరావుపేట గ్రామపంచాయతీ పరిధి పొలూరిపేటలో ఇళ్లకు తాకుతున్న వైర్లను విద్యుత్ శాఖ అధికారులు సరిచేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన గ్రామంలో సమస్యలను పరిశీలించి మాట్లాడారు. నాయకులు సరియం ప్రసాద్, పాయం శ్రీను, మడకం రాజు, వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు గుణపాఠం చెప్పాలి



సమావేశంలో మాట్లాడుతున్న పుల్లయ్య

చర్ల: పదేళ్ల పాలనలో ప్రజల సంక్షేమాన్ని పట్టించుకోని బీఆర్ఎస్‌కు వచ్చే ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలని సీపీఎం భద్రాచలం నియోజకవర్గ కోకన్వీనర్ కారం పుల్లయ్య పిలుపునిచ్చారు. మండలంలోని కుర్నపల్లి, బోదనెల్లిల్లో మంగళవారం జరిగిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం గిరిజన గ్రామాల అభివృద్ధిని పూర్తిగా విస్మరించగా, ప్రజలు సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. అలాగే, అటవీహక్కు పత్రాలు, దళిత బంధు, బీసీ బంధు, గృహలక్ష్మి మంజూరులో అక్రమాలు జరిగాయని ఆరోపించారు. ఈ సమావేశాల్లో నాయకులు మచ్చా వెంకటేశ్వర్లు, కె.బ్రహ్మచారి, రేపాకుల శ్రీనివాస్, కారం నరేష్, మడివి సంధ్య తదితరులు పాల్గొన్నారు.

దుమ్ము నివారణకు చర్యలు చేపట్టండి



బీటీపీఎస్ సీఈకి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మణుగూరు రూరల్: మండలంలోని సాంబాయిగూడెంలో దుమ్ము నివారణ చర్యలు చేపట్టాలని కోరుతూ సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా నాయకులు కోరారు. ఈసందర్భంగా మంగళవారం భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్ సీఈ బి.బిచ్చన్నకు వినతిపత్రం అందజేశాక ప్రజాపంథా డివిజన్ కార్యదర్శి ఆర్.మధుసూదన్‌రెడ్డి మాట్లాడారు. నిత్యం వందలాది బొగ్గు టిప్పర్లతో పాటు ఇతర వాహనాలు రాకపోకలతో దుమ్ము, ధూళి ఎగిసిపడి ఇబ్బంది ఎదురవుతోందని తెలిపారు. ఈమేరకు స్పందించిన సీఈ మాట్లాడుతూ ప్రతీరోజు నీళ్లు చల్లిస్తామని తెలిపారు. నాయకులు కె.రామకృష్ణ, గ్రామస్తులు హరిబాబు, వెంకటేష్, యాకూబ్ పాషా తదితరులు పాల్గొన్నారు.

పోడు భూములకు పట్టాలు ఇవ్వాలి



ర్యాలీలో పాల్గొన్న నాయకులు, గిరిజనులు

భద్రాచలంటౌన్: భద్రాచలం డివిజన్‌లో పోడు సాగు చేస్తున్న గిరిజనులందరికీ పట్టాలు ఇవ్వాలని న్యూడెమోక్రసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మంగళవారం పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్ నుంచి ఐటీడీఏ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి ధర్నా నిర్వహించారు. అనంతరం న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి గౌని నాగేశ్వరరావు మాట్లాడుతూ చర్ల మండలంలోని లింగాలలో 1980 నుంచి పోడు కొట్టుకుని సాగు చేస్తున్న గిరిజనులపై అటవీ అధికారులు కేసులు పెట్టి వేధిస్తున్నారని ఆరోపించారు. ఇకనైనా అధికారులు విచారణ చేపట్టి గిరిజనులకు చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో నాయకులు ముసలి సతీష్, వైఎస్.రెడ్డి, నరేష్, నాగయ్య, రామకృష్ణ, సమ్మక్క, నాగలక్ష్మి, నరసింహారావు, రాజమ్మ, సావిత్రి, దుర్గమ్మ తదితరులు పాల్గొన్నారు.

నిధులు లేకుండానే శంకుస్థాపనలా?



మాట్లాడుతున్న రవికుమార్

భద్రాచలంఅర్బన్: నిధులు మంజూరు చేయకుండా, టెండర్ల ప్రక్రియ పూర్తి చేయకుండా హడావుడిగా రాష్ట్ర మంత్రి అజయ్‌కుమార్ భద్రాచలంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడం గర్హనీయమని సీపీఎం నాయకులు బండారు రవికుమార్, మచ్చా వెంకటేశ్వర్లు విమర్శించారు. పట్టణంలో మంగళవారం పార్టీ నాయకుడు ఎం.బీ.నరసారెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఎన్నికల కోడ్ వస్తుందని తెలిసే మొక్కుబడిగా శంకుస్థాపన చేశారని ఆరోపించారు. ప్రజలను మరోసారి మోసం చేయడానికే ఇలాంటి కార్యక్రమాలు చేపటాటరని విమర్శించారు. ఈమేరకు బీఆర్ఎస్‌కు రానున్న ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఎం పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి, నాయకులు మర్లపాటి రేణుక, సున్నం గంగ, భూక్యా రమేష్, బి.వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాదారంలో దైవసేవకుల సదస్సు

ములకలపల్లి: మండలంలోని మాదారం గ్రామంలో మంగళవారం దైవ సేవకుల సదస్సు నిర్వహించారు. ఈమేరకు గండికోట కృపావరం దైవమందిరంలో ఏర్పాటు చేసిన సదస్సులో బిషప్ డాక్టర్ విక్రమ్‌పాల్, ముఖర్జీ దైవ వాక్యాన్ని, బైబిల్ విశిష్టతను వివరించారు. ఈకార్యక్రమంలో డాక్టర్ వినయ్‌కుమార్, కాశీ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చండ్రుగొండ: మండలంలోని పోకలగూడెం సబ్‌స్టేషన్ పరిధిలో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ ఎంఎల్.నర్సింహారావు తెలిపారు. కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు కారణంగా పోకలగూడెం, గానుగపాడు, రేపల్లెవాడ, అన్నారంతండా, మంగయ్యబంజార్, బాల్యా తండా, వెంకటియాతండా, వంకనెంబర్, సామ్యా తండా, కరిశెలబోడు గ్రామాల్లో ఉదయం 9నుండి సాయంత్రం 4 గంటలకు వరకు సరఫరా ఉండదని పేర్కొన్నారు. ఈ విషయానిన వినియోగదారులు గమనించాలని ఏఈ కోరారు.

దళితుల సంక్షేమానికి సీఎం కేసీఆర్ కృషి

అశ్వాపురం: ఏళ్లుగా అణచివేతకు గురైన దళితులు ఆత్మగౌరవంతో జీవించాలనే భావనతో దళితబంధు పథకాన్ని అమలుచేస్తున్న ఘనత సీఎం కేసీఆర్, బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందని పార్టీ యువజన విభాగం అధ్యక్షుడు గద్దల రామకృష్ణ అన్నారు. అశ్వాపురంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ, ఎమ్మెల్యే రేగా కాంతారావుకు దళితులు అండగా నిలవాలని కోరారు. కాగా, మణుగూరులో రూ.కోటి వ్యయంతో అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు జూపల్లి కిరణ్, వెంకటేశ్వర్లు, సురేష్, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి వైద్యానికి 'ఎక్సలెంట్' చేయూత



విద్యార్థి తల్లిదండ్రులకు చెక్కు అందజేస్తున్న కాంతారావు

మణుగూరు రూరల్: అనారోగ్యంతో బాధపడుతున్న విద్యార్థి వైద్యం కోసం ఎక్సలెంట్ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయ సిబ్బంది సహకారంతో యజమాన్యం చేయూతనివ్వడం అభినందనీయమని ఎమ్మెల్యే రేగా కాంతారావు అన్నారు. స్థానిక పైలట్‌కాలనీలోని ఎక్సలెంట్ హైస్కూల్‌లో ఒకటో తరగతి చదువుతున్న కె.షణ్ముఖ్ తలసేమియా వ్యాధితో బాధపడుతుండగా చికిత్స కోసం విద్యార్థులు రూ.81,083, ఉపాధ్యాయులు రూ.34,916 సమకూర్చగా యాజమాన్యం రూ.10వేలు కలిపి మొత్తం రూ.1,26,000 చెక్కును విద్యార్థి తల్లిదండ్రులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా మంగళవారం అందజేశారు. అనంతరం విద్యాసంస్థల చైర్మన్ ఎం.డీ.యూసఫ్ షరీఫ్ జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పోశం నర్సింహారావు, ఎక్సలెంట్ విద్యాసంస్థల కరస్పాండెంట్ ఎం.డీ.ఖాదర్, డైరెక్టర్ యాకూబ్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.